# అంతరంగం

"ఇంకో అరగంట పోనీ, ఆకలిగాలేదు. అలా గాలికి వెళ్లి మళ్లీ వచ్చి తినవచ్చు" అన్నది మనస్సు.

ఆనందరావు రొట్టెముక్కను బల్లమీదనే పెట్టి తలుపు వేసి బజారువైపు బయలు దేరాడు. రోజూ వున్నట్టుగానే వుంది బజారు. అంతా మనుష్యులు. కేవలం మానవులు. తీరికలేని దినచర్యలు. తనకు మాత్రం పగలల్లా వుద్యోగం. ఆ సాయం కాలం నుండి వుదయంవరకు స్వేచ్ఛ. ఏదో అర్థంలేని ఆలోచన లతో అరగంట కాగానే తిరిగి వచ్చాడు. తలుపుతీశాడు. బల్ల మీద రొట్టెముక్కను తింటున్నది పందికొక్కు. దాదాపు పూర్తి కావచ్చింది. ఆనందరావుకు కోపం వచ్చింది. కిటికీలు మూసివేశాడు. తలుపుగడియ బిగించాడు. గది చాల చిన్నది. ఎక్కడికి వెడుతుంది పందికొక్కు?

చేతికందిన కమ్మి తీసుకొని పోరాటాని కుపక్రమిం చాడు. ఆ పందికొక్కు ఎన్నో తంటాలు పడింది. ఉన్న రెండు పెట్టెల చుట్టూ శరణు శరణంటూ వేయి ప్రదక్షిణాలు చేసింది. చివరికి కమ్మితో కొట్టిన దెబ్బకు కుడికాలు తెగిపో యింది...రక్తం...రక్తం.

బల్లమీద నుండి...ఆ బల్లమీద నున్న చిత్తు కాగి తాలమీదనుండి చుక్కలు చుక్కలుగా కారుతూ వుంది. అది నెత్తురు. ఎవరిదైతేనేం దేనిదైతేనేం అది నెత్తురు. పచ్చి నెత్తురు. ఉడుకు నెత్తురు. అప్పుడే చిందిన నెత్తురు.

ఆనందరావు ఉలిక్కిపడ్డాడు. అతని గుండె లెందుకో కొట్టుకుంటూవున్నై. అతడాగిపోయాడు. ఆ పందికొక్కు బ్రహ్మాండమైన రక్కసునితో పోరాడిన బాల వీరునిలా బల్ల కివతల పడిపోయింది. ఆ వెలుగులో దానిని దగ్గరికి వెళ్లిచూ చాడు. దాని రెండు కళ్లనుండి స్రవిస్తున్నవి నీటి ధారలు. సంశయమెందుకూ? అది కన్నీరే! అది కూడా ఏడుస్తుంది. అది ఇప్పుడూ ఏడుస్తూనే వుంది. దానికి గుండె లున్నవి. ఆ హృదయంలో నెత్తురున్నది. దానికి ఉదరమున్నది. అందుకే ఆకలి వున్నది. కనుకనే అది రొట్టెను తిన్నది.

అనందరావు కుప్పగా కూచున్నాడు. అతని హృదయం నవనీతం. అతడొక కవీశ్వరుడు. ఆ బల్లమీద చిత్తు కాగి తాలు అతడు వ్రాస్తున్న కావ్యంలోని పద్యాలు. అవి నెత్తురు మరకలతో నిండిపోయినై.

"ఎందుకు కొట్టాను దీన్ని?" ఆనందరావు తనలో తానే ప్రశ్నించుకొన్నాడు. కొట్టడం కాదు ఖూనీ చేశాను. ఖూనీ... అదుగో పచ్చి నెత్తురు. ఎంత కొంచెమైనా అదీ నెత్తురే. ఎంత చిన్న ప్రాణమైనా అదీ ప్రాణమే.

"నాకు ఆకలి వేసింది నేను రొట్టెను తిన్నాను. అందుకే నీవు నన్ను చంపివేశావు" అంటున్నవా కళ్లు. దాని పెదిమలు కదులుతున్నాయి. అవి నీలాంబరం పూలుమల్లే విచ్చు కొన్నాయి. అది మాట్లాడుతున్నది.

"ఏమిటి నీవు వ్రాస్తున్నది?"

"కవిత్వం" తనకు తెలియకనే జవాబు చెప్పాడు ఆనందరావు.

"ఆ కావ్యంలో ఒక కథ. ఆ కథా వస్తువు అతిసామాన్యమైనదైనా అది హృదయాలను ద్రవింప చేస్తుంది. కరుణను ప్రభవింపజేస్తుంది. జాలిని స్రవింపజేస్తుంది." అంతరాత్మ చెబుతున్న సత్యమిది.

"నా కా కథను చెప్పవూ?" ప్రశ్నించాయి దాని కళ్లు.

ఆనందరావు హృదయం ధ్వనించింది. అతని కంఠం నుండి ప్రసారమైందొక అపూర్వ గానం...

"ఇదే కథ...చెబుతున్నాను. వింటున్నావా?" అన్నాయి అతని నేత్రాలు.

ఆ భావాన్ని గ్రహించిన దాని నయనాలనుండి రాలినవి ఆనందాశ్రువులు.

"ఇటీవలనే వచ్చిపోయిం దొక కాటకం."

"అవునవును. అప్పుడు మా జాతి పూర్తిగా నశించిపోతుం దనుకున్నాము" అన్నట్టు మూల్గింది పందికొక్కు.

"ఆ కరువులో ఒక కుగ్రామంలో జరిగిన సంఘటన ఈ కథ..."

"ఆ వెనుక..." గాయపడిన కుడికాలిని మెల్లగా కదలిస్తూ కొంచెం భారం తగ్గినట్లు పడుకొన్నది పందికొక్కు.

"ఆ కుగ్రామంలో ఒక రైతు కుటుంబం. చాల తక్కువ పొలం. ఆ పొలంకూడా మెట్ట. దానికి ఏటినీరు ఎక్కదు. కుంట నీళ్లు అందదు. బావి త్రవ్వితే బండ అడ్డువచ్చింది. అంతకంటే లోతుకు రాతిని చీల్చి బోరింగు పెట్టడానికి కావలసినంత పైకం లేదు. కనుక ఆ పొలానికి వర్షంనీరే ఆధారం. అను

క్షణమూ ఆకసంవంక చూస్తున్న ఆ రైతు సేద్యం లంక మేతకూ గోదావరి ఈతకూ సరిపోయినంతగా నైనా సరిపోదు కాడిగి తలకు గడ్డికూడా కరువే. పేరునకు సేద్యంకానీ అందులో వచ్చే ఆదాయం ఆ కుటుంబానికి ఏడాదిలో మూడు మాసాల కైనా చాలదు. అందుకే ఇల్లాదులు కూలి చేసేవారు ఈ కూలి ఎల్లకాలమూ దొరకదు. కోతలకాలం ఊడ్పుల కాలం తొలకరిలో మాత్రం ఓ పక్షం రోజులపాటు దొరకుతుండేవా పనులు."

కాలు మెలిక తిరిగినట్టుంది గాయంతో...ఆ కొస నెత్తురు గడ్డకట్టిందేమో! తాకితే మరీ నొప్పి కావచ్చు నను కొన్నాడు ఆనందరావు. పందికొక్కు మరీ కొంత విశ్రాంతిగా పడుకొన్నది. దాని కన్నుల నుండి నీరు కారడం ఆగిపోయింది ఆనందరావు మళ్లీ మొదలు పెట్టబోయి—,

"వింటున్నావా?" అన్నాడు.

"వింటున్నాను. చాల శ్రద్ధగా వింటున్నాను" అన్నట్టు చెవులను రిక్కించిందది.

"ఆ కుటుంబానికి మంచి కాలంలోనే కూడూ గుడ్డా చాలదు. ఉన్నట్టుండి కాకున్నా మెల్ల మెల్లగానే ప్రవేశిం చింది కరువు రక్కసి. అది ఈ మారు చాల భయంకరాకృతిని దాల్చింది నేలమీద తేమంతా పీల్చివేసింది. జలాశయాల లోని నీటినంతా త్రాగివేసింది. పచ్చని వృక్షాలనంతా చప్ప రించి పిప్పి పిప్పిగా ఉమ్మివేసింది. అడవులలోబడి సంపదనంతా స్వాహాచేసింది. చివరికి పశుగణాలను బాధించింది. అవి ఎముకల ప్రోవులైనా వాటి శల్యాలను చూర్ణంచేసి వదలి పెట్టింది.

అలాంటి పరిస్థితిలో ఆ రైతు కుటుంబం ఎదుర్కొన్న కడగండ్లు చివరికి ఆత్మాహుతి ఆ కావ్యంలో వుంది.

అందరూ చిక్కిపోయారు. ఎముకలైపోయారు. రైతు దంపతులు చరమాంకంలోవున్నారు ఎండి మాడిపోయిన అడవినంతా గాలించి తెచ్చిన గొట్టి గడ్డలు వుడుకుతూ వున్నాయి. ఇద్దరు పిల్లలూ ఆ వుడికే గడ్డలను చూస్తూ కూర్చున్నారు. ఆ సమయంలో ఎవరో ఒక అనాథ అక్కడికి వచ్చాడు. అతని కడుపు వెన్నంటుకొనిపోయింది. అతడు మాట్లాడగలడుగాని గొంతు పెగలడంలేదు, ఆరిపోబోతున్న కంటి పాపలు మాత్రం ఆకలి భావాలను వ్యక్తం చేస్తున్నాయి. అతడా పూరిగుడిసె ముందు కూలిపోయాడు.

పిల్లలా ముసలాణ్ని చూచి దోసెడు చన్నీళ్లను ముఖం మీద చల్లారు. అతడు ఆతడితో స్పృహ వచ్చినట్లు చూస్తూ అతి ప్రయత్నంమీద కుడిచేతినెత్తి ఆకలి అంటూ సంజ్ఞ చేశాడు.

పందికొక్కు కనులనుండి నీటిధార కారడం మొదలు పెట్టింది. అది ఈ మారు గట్టిగా మూలిగింది. ఆ మూలుగులో అనంతమైన బాధ ధ్వనించింది. ఆ వేదన ప్రస్ఫుటించింది శోకం ప్రతిధ్వనించింది

"ఆకలితో చేతులు చాచిన ఆ ముసలివాణ్ణి చూచి ఆ పిల్లలు నీరైపోయారు. వారి ఆకలిని వారు మరచిపోయారు. ఆవుడికీ వుడకని గడ్డలను తెచ్చి అతని ముందుంచారు. అతడు లేచి కూర్చున్నాడు. ఒకొక్క గడ్డనే తీసి తింటున్నాడు. అతడలా తింటున్నపుడు అతని కనులలో కన్పించే

సంతృప్తినీ, ముఖంలో వ్యక్తమయ్యే కృతాజ్ఞతా భావాన్ని చూస్తూ కూచున్నారాపిల్లలు.

ఇంతలో ఆ రైతు అక్కడికి వచ్చాడు. ఆ దృశ్యాన్ని చూచి స్తబ్ధుడై నిలబడిపోయాడు. పిడికెడు గడ్డల కోసం ఎన్ని మైళ్లు తిరగాలో అతనికి తెలుసు. అతని కడుపు దహించుకపోయింది. రెండు రోజులు శ్రమపడి ఆ చిన్నబిడ్డలకోసం సంపాదించిన ఆ గడ్డలను ఎవరో పరాయివాడు తినివేస్తున్నాడు అతనికి కోపం వచ్చింది. అలాంటి పరిస్థితులలో వచ్చే కోపానికీ, మామూలు వాతావరణంలో ప్రభవించే క్రోధానికీ ఎంతో తారతమ్యం వుంది. ఆ భేదమే కన్పించిందతని కోపంలో అతడు ఆవేశంతో అంధుడై పోయాడు. ఒక్కసారి ఈ లోకమంతా స్వార్థమనే ముసుగులో భయంకరంగా మూలుగుతున్నట్లు కన్పించిందతనికి. చేతికందిన బడితెతో ఆ వృద్ధుని మస్తిష్కాన్నీ వేయి ముక్కలు చేయాలనుకొన్నాడు. తండ్రి కోపాన్ని పసికట్టిన ఆ పిల్లల్లో పెద్దవాడు సాహసంచేసి అన్నాడు. "మేమే ఇచ్చాము నాన్నా, ఆకలికి చచ్చిపోతున్నాడు" అని. ఈ మాటలంటూ ఆ కుర్రాడు తండ్రికీ, ముసలాడికీ మధ్య నిలబడ్డాడు. ముసలాడి మాటలనేమీ గమనించడంలేదు. అతడు చావుకైనా సిద్ధపడే వున్నాడు ఆ చనిపోవడానికి ముందు కడుపునిండా తిని చావాలన్నదే అతని ఆకాంక్ష. ఆకలిని చల్లార్చుకోవడమే అతని ధ్యేయం."

ఆనందరావు చెబుతున్నకొద్దీ పందికొక్కు అతని వంకనే చూస్తున్నది.

"ఇంతవరకూ వచ్చింది కథ. ఆ వెనుక ఆ ముసలాడు ఆ కుటుంబాన్ని రక్షించడంకోసం అత్యంత సాహసానికి దిగు

తాడు. అడవిలో గడ్డలకోసం తిరుగుతున్నపుడు ఒక చిన్న గుడారం కన్పిస్తుందతనికి ఆ గుడారం వేటకోసం వచ్చిన జమీందారుది ఈ ముసలాడు అందులో ప్రవేశిస్తాడు. ఇద్దరు నౌకర్లు మైమరచి నిద్రపోతుంటారు. అక్కడున్న తినుబండారాలనంత మూట గట్టుకొంటాడు. వారం రోజులకు చాలినంత ఆహార సామగ్రి దొరుకుతుంది. ఆ మూటను అతి కష్టం మీద ఎత్తి నెత్తిన పెట్టుకొంటాడు. గుడారంనుండి పది గజాలు దాటుకొంటాడు. ఇంతలో ఆ నౌకర్లు మేలుకొంటారు. చిందర వందరైన వస్తువులను చూడ్డంతోనే వారి దృష్టి నాలుగు ప్రక్కలా ప్రసరించబడుతుంది. వారిలో ఒకడు చాలా చురుకైనవాడు. తక్షణం ముసలాణ్ని గుర్తించి లేడి పిల్లలా అందెలు వేసుకొంటూ పరుగుతీస్తాడు. పాపం వృద్ధుడు వెనుదిరిగి చూచి ప్రాణాన్ని గుప్పిట్లో పెట్టుకొని పరుగెత్తుతాడు.

అది అడవి ప్రాంతమని నీకు ముందుగానే చెప్పాను. ఒక్కొక్క చోట కాలు జారితే ఎముకలు చూర్ణమయ్యేటంత ప్రమాదమైన జర్రెలు. అంతపనీ జరిగింది. ఆ ముసలాడి బొటనవ్రేలు చిన్న రాతికి తగిలి తూలి పడ్డాడు. పట్టుతప్పి నాలుగుమట్లు క్రిందికి దొర్లాడు. అదొక వెదురు పొద. అందులో నున్న ముండ్లు ఈటెల కంటె పదునైనవి. కత్తుల బోనులో పడ్డ వానిలా ఆ వృద్ధుడు గిజ గిజ లాడిపోతున్నాడు. అంత జరిగినా అతడామూటను వదలిపెట్టలేదు."

పందికొక్కు పెదవులను కదిలించింది. ప్రాణం పోతున్నా అతడు తన ప్రాణాన్ని రక్షించిన పిల్లలను రక్షించాలనే పట్టు

ధలతోనే వుంటాడు" అంటున్న దనుకున్నాడా పెదముల కద లికలోని భావాలను గమనించిన ఆనందరావు.

"ఆ వృద్ధుడు పడ్డ వెదురుపొద వద్దకు వచ్చాడా నౌకరు. ఆ ముసలాణ్ని చూచిందే అతని కోపం హరించుకపోయింది. పరితాపంతో హృదయం దహించుకపోయింది. జమీందారు నౌకరైనా అతడూ ఒక పేదవాడే. అవసరం వచ్చినపుడు అతని హృదయం పేదలతో కలిసిపోతుంది. ముసలివాణ్ని పైకి తీసి పొదనుండి ఇవతలకు తెచ్చిపెట్టాడు. ఆ వృద్ధుడు కన్నులు మూస్తూ తెగస్తూ వున్నాడు. అంత ఎత్తునుండి పడడంచేత అతని ముదురు ఎముకలు ఎక్కడికక్కడ విరిగిపోయాయి. పండి పోయిన గుండెలు పగుళ్లువారుతూ వుంది. అక్కడికక్కడే చేరెడు నెత్తురు కక్కుకున్నాడు. "నేను చచ్చిపోతున్నాను బాబూ. నువ్వెవరివో నాకు ఒక వుపకారం చేస్తావా? మనిషి చచ్చిపోయేడప్పుడు కోరుకోనే వరాలు సాధారణంగా అత్యంత స్వల్పమైనవే. ఇక్కడికి రెండు మైళ్ల దూరంలో వుత్తరంగా ఒక ఎండిపోయిన కుంట వున్నది. ఆ కుంట కట్టకు దిగువ తూము దగ్గరే చిన్న గుడిసెలో ఇద్దరు పిల్లలుంటారు. వారు ఆకలికి ఈ పాటికే చచ్చిపోయారేమో! భగవంతుడు అంతపని చేసివుండడనుకొంటాను. నీవు ఈ మూటను పట్టుకెళ్లి వారికి అందిస్తానని చెబితే నేను చల్లగా సంతృప్తిగా కన్నులు మూస్తాను" అన్నాడా వృద్ధుడు.

నౌకరు అలాగేనంటూ మాట అవగానే ఆ వృద్ధుని ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమై పోయాయి.

ఉలిక్కిపడ్డట్లు ఎగిరిపడింది పందికొక్కు. ఆ వృద్ధుని ప్రాణాలు పోయాయని విన్నప్పుడు దాని హృదయం ఎంతగా చలించిందో ననుకొన్నాడు ఆనందరావు. పందికొక్కు తన ముందరి కాళ్లను మెల్లగా కదిలించింది. దాని గాయం నుండి మెల్లగా నెత్తురు కారడం ఎప్పుడో ఆగిపోయినా కన్నులనుండి మాత్రం నీరు కారుతూనే వుంది.

"ఆ నౌకరు ఆ వృద్ధుని శవాన్ని అక్కడున్న ఎండు టాకులతో కప్పి ఆ మూట నందుకొని గుడిసె వేపు పరుగు తీశాడు. ఒక నిండుప్రాణం పోయింది. ఆ పసి శిసువులనైనా రక్షించగల్గితే తన జన్మ సార్థక మైనట్లేనని అతడు భావించాడు. తిండికిలేక పూరువదలి అందరూ వెళ్లిపోయిన విషయం అతడెరుగును. కానీ ఆకలితో కనులముందే చచ్చిపోయిన వారినంత వరకూ అతడు చూడలేదు. ఆ పిల్లలెవరో పాపం! బహుశా ఈ వృద్ధునికి మనుమలై వుంటారని అతడు భావించుకొంటూ శరవేగంతో రాళ్లు రప్పల్ని దాటుకుంటూ ముందుకు పోతున్నాడు. అలా పరుగెత్తుకొంటూ వెళ్లి గుడిసెను సమీపించేలోగా అర్తనాదం వినిపించింది. అతని గుండెలు ద్రవించి పోయాయి. ఒక పిల్లవాడు చనిపోయాడేమో. మరో బిడ్డనైనా బ్రతికిస్తానంటూ మరీ వేగంగా గాలికంటే తీవ్రంగా దూసుకపోయాడు. గుడిసెలో అడుగుపెట్టగానే అతని హృదయం పగిలిపోయింది. ఒక బిడ్డ ఎప్పుడు చనిపోయాడో... రెండో బిడ్డ అప్పుడే కన్నులు మూశాడు. ఆ తల్లి తేలకళ్లువేసి రెండు చేతులతోనూ రెండు శవాలను పొదివి పట్టుకొని అచేతనంగా పడివున్నది. ఆ రైతు మహా యోగీశ్వరునివలె వింధ్యాచలం కూర్చునట్లు సమాధి నిమగ్నుడయ్యాడు. అది దీర్ఘసమాధి.

పందికొక్కు పెద్ద నిట్టూర్పు విడిచింది. దాని నేత్రాలలో గంగాయమునలే అవతరించాయి. ఉన్నట్టుండి. ఏదో గుర్గుర ధ్వని కూడా విన్పించింది.

ఆనందరావు దానివైపు అలాగే చూస్తూన్నాడు.

పందికొక్కు కన్నీటి ధారలు ఆగిపోయాయి. రెండు కళ్లూ తేలిపోయాయి.

"కవీ...నీ కావ్యంలో సందేశం యిదే. ఆకలి యెలాంటిదో లోకానికి చెప్పాలనేకదా కావ్యం వ్రాశావు. ఆ ఆకలికి తట్టుకోలేకనే రొట్టెముక్కను తిన్న నన్ను చంపేశావు. అనాదినుండీ మానవునిలో అనుశ్రుతంగా వస్తున్న సాంప్రదాయమే యిది. తానేంచేస్తున్నాడో లోకానికి చెప్పడు. ఇతరులేం చెయ్యాలో అది మాత్రమే చెబుతుంటాడు. మీరంతా మానవులు..."

అది పెదవుల్ని విప్పి చెప్పినట్లేవుంది. ఆనందరావు అంతరంగంలోని కరుణాసింధువు హోరుమని కట్టలు త్రెంచుకొన్నది.

